ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రక్తదానం చేయడం ద్వారా ప్రమాదంలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

- ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని నియమించామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

- దేశవ్యాప్తంగా వైద్య, విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ 2025 పరీక్ష ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.

- రాష్ట్రంలో మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు.

- యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు, చేసే వృత్తిలో విజయాలను సాధించవచ్చని శాసనసభ ఉపసభాపతి కె.రఘురామ కృష్ణంరాజు అన్నారు.

==================

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అర్హులైన వారందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్. అబ్దుల్ నజీర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని విద్యార్థులు, యువత AP RED CROSS మొబైల్ యాప్ ద్వారా రక్తదాతలుగా నమోదు చేసుకోవాలని సామాజిక మాధ్యమం వేదికగా కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20 రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలలో రక్తదానం చేయాలని, ప్రమాదంలో ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడాలని గవర్నర్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు రక్తదానం ప్రాముఖ్యతను గుర్తుచేసుకునేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గవర్నర్ అన్నారు. "రక్తదానం చేయండి, ఆశను కల్పించండి, అందరం కలిసి ప్రాణాలను కాపాడుకుందాం" అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం కార్యక్రమాలను జరుపుతున్నామని గవర్నర్ తెలిపారు.

==================

అహ్మదాబాద్ లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈరోజు న్యూఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రమాదం జరగడానికి గల కారణాలను తెలుసుకునేందుకు ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని నియమించామని వెల్లడించారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే సహాయక బృందాలు, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అవసరమైన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. తమ మంత్రిత్వ శాఖ నుంచి ఈ ప్రమాదాన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని రామ్మోహన్ నాయుడు చెప్పారు.

==================

దేశవ్యాప్తంగా వైద్య, విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ) ఈరోజు విడుదల చేసింది. అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా దరఖాస్తు నెంబర్ ఎంటర్ చేసి ఫలితాలను తెలుసుకోవచ్చు. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మెరుగైన ప్రతిభను కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 36,776 మంది నీట్ పరీక్షకు అర్హత సాధించారు. కాగా.. మే 4వ తేదీన నీట్ యూజీ-2025 ప్రవేశ పరీక్షను నిర్వహించారు.

===================

రాష్ట్రంలో మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా పాకాల మండలం దామల చెరువులో మామిడి రైతులు, వ్యాపారులతో మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5లక్షల హెక్టార్లకు పైగా మామిడి పంట సాగు అవుతోందన్నారు. 22వేల టన్నులు మార్కెటింగ్ జరిగిందని, ఇంకా లక్ష టన్నులకు పైగా జరగాల్సి ఉందన్నారు. తోతాపూరి రకం కిలో కి 12రూపాయల చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. ఇందులో రైతుకు, ప్రభుత్వం 4 రూపాయలు అందిస్తుందని, పరిశ్రమలు 8 రూపాయలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమలు సహకరించకపోతే చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ బైట్...39 సెకన్లు)

===================

యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు మనం చేసే వృత్తిలో విజయాలను కూడా సాధించవచ్చని శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. ఈరోజు పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెద్దఅమిరంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాభ్యాసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ... యోగా నిరంతర ప్రక్రియ అని, ప్రతీరోజు కొంత సమయాన్ని కేటాయించుకుని యోగా సాధన చేయాలని సూచించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 8 లక్షల 50 వేల మంది రిజిస్ట్రేషన్లు చేసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఈ నెల 21న జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొనడం శుభపరిణామం అని అన్నారు. జూన్ 21వ తేదీన జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేసి, పశ్చిమగోదావరి జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతీఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు.

===================

విరామం

===================

శ్రీకాకుళం జిల్లా హిరమండలం కూర్మ గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం వేదికగా ఆయన ఈరోజు అగ్నిప్రమాదంపై స్పందిస్తూ.. ఈ ప్రమాదంపై పోలీసులు సమగ్ర విచారణ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో లోతైన దర్యాప్తు చేపట్టాలని అన్నారు. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైందన్నారు. కూర్మ గ్రామ వాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి గృహాల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

===================

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఈరోజు తిరుపతి రూరల్ పరిధిలోని సి.రామాపురంలో చెత్త నుంచి ఎరువులను తయారుచేసే ప్రాంతాన్ని మంత్రి నారాయణ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ను స్వచ్ఛాంధ్రప్రదేశ్ గా మార్చే ప్రయత్నం చేస్తున్నామని, రాష్ట్రంలో ఉన్న 85లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను అక్టోబర్ 2వ తేదీలోగా ఎరువుగా మార్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం వేగవంతంగా జరుగుతోందన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా 10వేల కోట్ల రూపాయలను తల్లుల ఖాతాల్లోకి జమచేశామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...35 సెకన్లు)

===================

పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉమ్మడి కార్యదర్శి కేశంగ్ యాంగ్జామ్ షేర్పా అన్నారు. పొగాకు కొనుగోళ్ల పరిశీలనలో భాగంగా ఆమె ఈరోజు ఒంగోలులోని పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులు, కొనుగోలుదారులు, రైతు నాయకులు, బోర్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. అందరి సమన్వయంతో పొగాకు రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె చెప్పారు.

===================

స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఒక జిల్లా–ఒక ఉత్పత్తి (One district – One Product) పేరిట కేంద్ర ప్రభుత్వం మన దేశంలో లభించే అనేక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపును అందిస్తోంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటివరకు అరకు కాఫీ, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, ధర్మవరం, వెంకటగిరి సిల్క్ చీరలు, మంగళగిరి చేనేత వస్త్రాలు గుంటూరు మిర్చి వంటి 26 ఉత్పత్తులకు ఈ గుర్తింపు లభించడం మన రాష్ట్రంలోని నైపుణ్యాలను తెలియజేస్తోంది. అయితే తాజాగా బాపట్ల జిల్లా చీరాలలో తయారయ్యే కుప్పడం చీరకు కూడా కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు(GI టాగ్) ను ప్రకటించింది. దీనిపై స్థానిక చేనేత కళాకారుడు ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ బైట్...33 సెకన్లు)

===================

===================